సాక్షి జోగుళాంబ గద్వాల

గురువారం । 15 । ఆగస్టు । 2024

మదినిండా దేశభక్తి
- 78 ఏళ్లుగా తమ గుడిసె ఎదుట జెండా పండుగ

మద్యానికి దూరం.. స్ఫూర్తి పథం
- గోప్లాపూర్‌లో 9 ఏళ్లుగా నిషేధం

పుట్టిన ఊరిపై మమకారంతో..

- వివరాలు IIలో

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

- విద్యుద్దీపాల వెలుగుల్లో ప్రభుత్వ కార్యాలయాలు
- పరేడ్ మైదానంలో ఏర్పాట్లు.. పరేడ్ రిహార్సల్ పూర్తి
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి


విద్యుద్దీపాల వెలుగులో కలెక్టరేట్

గద్వాల/గద్వాల క్రైం: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలీస్ పరేడ్ మైదానం వేడుకలు నిర్వహించేందుకు ఎంపిక చేసిన విషయం విదితమే. వేడుకలను విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకొని గత వారం రోజుల నుంచే కసరత్తు మొదలు పెట్టారు. ఉదయం, సాయంత్రం ఎన్‌సీసీ విద్యార్థులు, పోలీసుల సాధనలతో మైదానంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ వేడుకలకు జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అవకాశం కల్పించారు. పరేడ్‌లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. అందులో భాగంగా గత రెండు రోజుల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు, రిహార్సల్స్ చేశారు. కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాస్‌రావు ఏర్పాట్లను నిత్యం పర్యవేక్షిస్తు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

షెడ్యూల్ ఇలా..
జిల్లా కేంద్రంలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ సలహాదారుడు, ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను ఆయన ఆవిష్కరణ చేసి వందన స్వీకారం చేస్తారు. సందేశం తరువాత విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జిల్లా అంతటా సందడి..

జిల్లా కేంద్రంతోపాటు మండల కేంద్రాల్లో స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసుకున్నారు. జిల్లా అంతటా సందడి నెలకొంది. జాతీయ జెండాలు, ఇతర సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి. పూల మార్కెట్‌లో విద్యార్థినుల సందడి నెలకొంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వాతంత్య్ర వేడుకలకు పాఠశాలలను ముస్తాబు చేశారు. జిల్లా కేంద్రంలోని జాతీయ నాయకుల విగ్రహాలకు రంగులు వేశారు. జిల్లా అంతటా జాతీయ పండగ వాతావరణం కొట్టొచ్చినట్లు కనిపించింది.

పరేడ్ రిహార్సల్ పూర్తి
స్వాతంత్య్ర వేడుకలకు సంబంధించి పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుశాఖ చేపట్టే పరేడ్ రిహార్సల్స్‌ను బుధవారం ఎస్పీ శ్రీనివాసరావు, ఏఎస్పీ గుణశేఖర్ పరిశీలించారు. వేడుకలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ప్రజలకు, అధికారులకు గ్రౌండ్‌లో వసతులపై ఆరా తీశారు.


జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో రిహార్సల్స్‌లో భాగంగా గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

జూరాలకు 24,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు పూర్తిగా తగ్గిపోయాయి. బుధవారం రాత్రి 9 గంటల వరకు జూరాల ప్రాజెక్టుకు కేవలం 24,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్టుకు స్వల్పంగా ఇన్‌ఫ్లో పెరగడంతో ప్రాజెక్టు ఎగువ జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో 5 యూనిట్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి మొత్తం 35,638 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

సుంకేసులలో 25 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో 25 గేట్ల ద్వారా నీటి విడుదల చేస్తున్నారు. బుధవారం ఎగువ నుంచి ఒక 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక 1.06 క్యూసెక్కులను దిగువకు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులను విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు.

ఆయకట్టుకు నీటి విడుదల

అయిజ: నాగర్‌దొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వద్ద బుధవారం నీటి పారుదల శాఖ ఏఈ సూర్య ప్రకాష్ రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగిరెడ్డి రైతులతో కలిసి గేటు పైకెత్తి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేశారు. అనంతరం గంగమ్మకు పూజ చేశారు. నీరు వృథా చేయవద్దని, అవసరమైన మేర నీరు పారించాలని వారు సూచించారు.



దేశ సంరక్షణలో ముందుండేది ఆర్మీ.. మనం హాయిగా స్వేచ్ఛావాయువులు పీలుస్తూ బతుకుతున్నామంటే.. అందుకు కారణం సైనికులు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా.. కళ్లలో ఒత్తులేసుకొని దేశాన్ని కాపాడుతుంటే.. మనం గుండెలపై చెయ్యి వేసుకొని కంటి నిండా నిద్రపోగలుగుతున్నాం. నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ.. మాతృభూమి సేవలో తరించే జవాన్ల త్యాగం వెలకట్టలేనిది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఎంతో మంది దేశ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తూ మాతృభూమి రుణం తీర్చుకుంటున్నారు. గురువారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– నవాబుపేట/ మహమ్మదాబాద్/ నాగర్‌కర్నూల్ రూరల్

జయహో.. సైనికా

దేశ సంరక్షణలో పాలమూరు బిడ్డలు

- కూచూర్, వెంకట్‌రెడ్డిపల్లి, పెద్దముద్దునూరు నుంచి పదుల సంఖ్యలో సైనికులు
- గ్రామ వారసత్వంగా భావించి ముందుకొస్తున్న వైనం
- కుటుంబాలకు దూరంగా.. సరిహద్దులో విధులు
- స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కూచూర్ గ్రామం ఆర్మీ జవాన్లకు అడ్డాగా మారింది. దేశం కోసం ప్రాణాలు అర్పించేందుకు మేమంటే మేమున్నామని పోటీ పడుతోంది. గ్రామంలోని ప్రతి రెండిళ్లలో ఒకరు సైనికుడిగా సేవలందిస్తున్నారు. అయితే గ్రామం నుంచి ఆర్మీలో తొలిగా చేరింది రవి. గ్రామానికి చెందిన వీరప్ప తన పెద్ద కుమారుడు రవిని 1993లో ఆర్మీలో చేర్పించారు. అనంతరం మరో ఇద్దరు కుమారులను సైతం ఆర్మీలోకి పంపారు. వీరి స్ఫూర్తితో యాదయ్య అనే వ్యక్తి ఆర్మీలో చేరారు. నాటి నుంచి కూచూర్ యువత ఆర్మీలో చేరడం ప్రారంభమైంది. ఆర్మీలో రిటైర్డ్ అయిన సైనికులు నేటికీ యువతలో ప్రేరణ కలిగిస్తూ.. ఆర్మీలో చేరేందుకు సహకారం అందిస్తున్నారు. మొత్తం 3,248 జనాభా కలిగిన గ్రామంలో ఇప్పటి వరకు 78 మంది ఆర్మీలో చేరగా.. మరో 9 మంది సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్‌లో చేరారు. మరో 10 మంది పోలీసు ఉద్యోగాలు నిర్వర్తిస్తున్నారు.





1975 నుంచి అగ్నిపథ్ దాక

శత్రుమూకల నుంచి దేశాన్ని రక్షించడం కోసం ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయడం లేదు నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూరు గ్రామ యువత. దేశ భద్రతే లక్ష్యంగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు దేశాన్ని సంరక్షిస్తూ.. మరోవైపు గ్రామానికి పేరు తీసుకువస్తున్నారు. 2019లో కాశ్మీర్ బార్డర్‌లో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌లో 500 మంది మిలిటెంట్లను హతమార్చిన ఘటనలో గ్రామానికి చెందిన కిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.

- పెద్దముద్దునూరుకు చెందిన వడ్ల బ్రహ్మయ్యచారి 1975లో మొదటగా ఆర్మీలో చేరారు. ఆయనను ఆదర్శంగా తీసుకున్న గ్రామ యువకులు సైన్యంలో చేరేందుకు ముందుకొచ్చారు. ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముళ్లు సాదిక్ పాషా, మైపాషా సైన్యంలో చేరారు. అలాగే తుమ్మల నాగేష్, తిరుపతయ్య ఇరువురు సైన్యంలో చేరి విధులు నిర్వహిస్తున్నారు. గ్రామం నుంచి వివిధ భద్రతా విభాగాల్లో 60 మంది దాక చేరగా.. 80 శాతం యువకులు ఆర్మీలోనే ఉన్నారు. నేవీలో ఒకరు, సీఆర్‌పీఎఫ్‌లో నలుగురు, బీఎస్‌ఎఫ్‌లో ముగ్గురు, ఐటీబీటీలో ఇద్దరు పనిచేస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నిపథ్‌లోనూ ఇద్దరు యువకులు చేరారు. అంతేకాకుండా ఏఆర్‌లో ముగ్గురు, సివిల్ కానిస్టేబుళ్లుగా ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నారు.

ఉరకలేసే ఉత్సాహంతో..
మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండలంలోని మారుమూల గ్రామం వెంకట్‌రెడ్డిపల్లి. ఆ గ్రామ యువకులు ఉరకలేసే ఉత్సాహంతో దేశ సరిహద్దులో విధులు నిర్వరిస్తూ.. మాతృభూమి సేవలో తరిస్తున్నారు. వెంకట్‌పల్లి జనాభా 2000 కాగా.. 65 మందికి పైగా దేశ సేవలో అంకితమై ఆర్మీలో చేరారు. మొదటగా ఆర్మీలో చేరిన అమరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి వంటి సీనియర్ల సలహాల మేరకు యువకులంతా ఆర్మీ బాట పట్టారు. తల్లిదండ్రులు, భార్యాపిల్లలను వదిలి, సంవత్సరాల తరబడి దేశ సంరక్షణకు పాటుపడుతున్నారు. దేశ సరిహద్దులోని ఢిల్లీ, జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న తమ కుమారులను చూసి తల్లిదండ్రులు ఎంతో గర్విస్తున్నారు. ఇలా ఒకరిని చూసి మరొకరు తమ పిల్లలను ఆర్మీలోకి పంపించేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నారు.


బంకర్లు పేల్చుతున్న ఆర్మీ జవాన్లు (ఫైల్)

గౌరవంగా భావిస్తాం..

ఆర్మీలో చేరడం ఎంతో గౌరవంగా భావిస్తాం. కుటుంబాన్ని వదిలి వెళ్లడం కొంత కష్టంగా కనిపించినా.. విధుల్లోకి చేరగానే దేశ సేవలో నిమగ్నమవుతాం. మా గ్రామం నుంచి చాలా మంది ఆర్మీలో చేరడం గర్వకారణంగా ఉంది. గ్రామ వారసత్వంగా భావించి.. ఆర్మీలో చేరేందుకు యువత ముందుకు వస్తున్నారు.

– వెంకటేష్, ఆర్మీ జవాన్, కూచూర్, నవాబ్‌పేట మండలం

సదుపాయాలు కల్పించాలి..

ప్రతిఏటా ఆర్మీలో చేరికలతో మా గ్రామానికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. యువతకు ప్రత్యేకంగా సదుపాయాలు కల్పిస్తే, మరింత మంది ఆర్మీలో చేరే అవకాశం ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం తరఫున యువతకు వ్యాయామం, జిమ్ వంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి.

– అమీర్, రిటైర్డ్ జవాన్, కూచూర్, నవాబ్‌పేట మండలం

దేశ రక్షణే ధ్యేయంగా..

గ్రామంలో ఉన్న సీనియర్లను ఆదర్శంగా తీసుకుని దేశ సంరక్షణే ధ్యేయంగా ఆర్మీలో చేరా. విధుల్లో ఉన్నప్పుడు ప్రాణాలను సైతం లెక్కచేయం. గ్రామానికి ఎప్పుడైనా వస్తే.. అందరం కలిసి విధుల గురించి చర్చించుకుంటాం. సంతోషంగా పండుగలు జరుపుకొంటాం. ప్రతి సంవత్సరం 3 నెలలు మాత్రమే కుటుంబంతో గడిపేందుకు వీలుంటుంది.

– ఎ.చంద్రయ్య, ఆర్మీ జవాన్, వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్ మండలం

దేశ సేవలోనే సంతృప్తి..

ఇంటర్‌లోనే ఆర్మీ వైపు దృష్టిసారించా. దేశ సేవలో భాగంగా ఎక్కడికి పంపించినా విధులు నిర్వహించాను. గోవా, కలకత్తా, జమ్ముకశ్మీర్, పుణె తదితర ప్రాంతాల్లో పనిచేశా. దేశసేవలో ఉన్నప్పుడు గ్రామం, కుటుంబాలు ఏవీ గుర్తుకురావు. అక్కడి బాధ్యతలు ఎంతో గొప్పవి. దేశ సేవలోనే సంతృప్తి పొందుతున్నాం.

– కె.శేఖర్, ఆర్మీ జవాన్, వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్ మండలం

బాధ్యతాయుతమైనది..

ఆర్మీలో చేరాక కఠిన శిక్షణ ఉంటుంది. అనంతరం నిర్వహించే విధులు మాత్రం ఎంతో బాధ్యతాయుతమైనది. అలాంటి దేశ సేవలో మా గ్రామం ముందుండాలని భావించాం. ఆర్మీలో చేరే యువతకు ప్రోత్సాహం అందిస్తున్నాం.

– కె.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్మీ రిటైర్డ్ కమాండో, వెంకట్‌రెడ్డిపల్లి, మహమ్మదాబాద్ మండలం

మరువలేని అనుభూతి..

గ్రామంలో నా స్నేహితులందరూ ఆర్మీలోకి వెళ్తుండటం చూసి.. నాలో ఆసక్తి పెరిగింది. కుటుంబ సభ్యులూ ప్రోత్సహించారు. దేశ సేవ కోసం ఆర్మీలో చేరాను. జమ్ముకశ్మీర్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించాను. 2019లో కశ్మీర్ బార్డర్‌లో విధులు నిర్వహిస్తున్న సందర్భంలో సర్జికల్ స్ట్రైక్ జరిగింది. ఆ సందర్భంగా 500 మంది పాకిస్తాన్ మిలిటెంట్లను హతమార్చిన ఆపరేషన్‌లో పాల్గొన్నాను.

– కిషోర్‌గౌడ్, రిటైర్డ్ ఆర్మీ జవాన్, పెద్దముద్దునూరు, నాగర్‌కర్నూల్ మండలం

గ్రామం నుంచి మొదటిసారి..

తల్లిదండ్రులు ఆర్థికంగా లేకపోవడంతో పై చదువులు చదివించలేదు. ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలని 1975లో గ్రామం నుంచి మొట్టమొదటి సారిగా ఆర్మీలో చేరాను. దేశ సరిహద్దులైన జమ్ముకశ్మీర్‌లో మొదటి పోస్టింగ్ తీసుకుని అరుణాచల్ ప్రదేశ్, పంజాబ్, సిక్కిం తదితర రాష్ట్రాల్లో విధులు నిర్వహించా. గ్రామంలో యువకులు ఆర్మీలో చేరే విధంగా ప్రోత్సాహం అందిస్తున్నాం.

– బ్రహ్మయ్యచారి, రిటైర్డ్ ఆర్మీ జవాన్, పెద్దముద్దునూరు, నాగర్‌కర్నూల్ మండలం

11 ఏళ్లుగా విధులు..

మా గ్రామం నుంచి అధిక సంఖ్యలో యువకులు ఆర్మీలోకి వెళ్తుండటంతో నేను కూడా ఆర్మీలో చేరాలని ఆసక్తి పెంచుకున్నా. 2013లో ఆర్మీలో చేరాను. దేశ సరిహద్దులో విధులు నిర్వహించి, ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్నాను. దేశ భద్రతలో పాలుపంచుకోవడం సంతోషాన్నిచ్చింది.

– చిన్నయ్య, ఆర్మీ జవాన్, పెద్దముద్దునూరు, నాగర్‌కర్నూల్ మండలం


దేశ సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న కూచూర్ యువకుడు

కాంగ్రెస్ తప్పిదాల వల్లే దేశ విభజన


సదుస్సులో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాల: సర్వమత సమ్మేళనం, భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న భారతదేశాన్ని ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లనే భారతదేశం ముక్కలైందని, దేశ విభజన పాపం మొత్తం కాంగ్రెస్‌దే అని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో 'దేశ విభజన గాయాలు స్మారక దినం'పై మేధావుల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆనాటి దేశ విభజన పరిస్థితులు నేటికి మానని గాయాలుగానే మిగిలి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశ చరిత్రను, స్వాతంత్య్ర పోరాట పరిస్థితులను ఈ తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడు మతోన్మాద శక్తులు చేసిన అరాచకాలు మారణహోమం కంటే ఎక్కువేనని పేర్కొన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని, వారి త్యాగాల స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ దేశం నాది అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలన్నారు. ఆ ఉద్దేశంతోనే ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారన్నారు. స్వాతంత్య్ర సమరయోధుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం వేళ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి సమైక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, రామంజనేయులు, శివారెడ్డి, రాజగోపాల్, బండల వెంకట్రాములు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం
గద్వాల: జిల్లా కేంద్రంలోని చింతలపేట కాలనీలో ఉన్న వీరాంజనేయస్వామి దేవాలయ బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం కాలనీలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన బొడ్రాయికి సాంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వీరాంజనేయస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆమె కోరారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి బండ్లజ్యోతితో పాటు పలువురు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి


జిల్లా ఆస్పత్రిలో మందుల స్టాక్ వివరాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల క్రైం: రోగులకు మెరుగైన సేవలు అందించాలని.. ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. బుధవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రి సిబ్బంది హాజరు, సమయపాలన, మందులు, తదితర అంశాలపై రికార్డులను పరిశీలించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై వచ్చే రోగులకు రక్త పరీక్షలు, టీ హబ్ ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. సాంకేతిక సమస్యల కారణం చూపి ప్రైవేటు ల్యాబ్‌లకు రెఫర్ చేయవద్దన్నారు. గర్భిణుల విషయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, వారి పట్ల దురుసుగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం పలు వార్డులను తిరిగి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, విషజ్వరాలు, మలేరియా, కేసుల విషయంలో వైద్యులు నిర్లక్ష్యం వహించొద్దని, నూతనంగా మంజూరైన ఎస్‌డీపీ మిషన్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. మౌలిక వసతులు, మందుల కొరత అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, సిబ్బందిపై రోగులు ఫిర్యాదులు చేస్తే శాఖ పరమైన చర్యలు ఉంటాయన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారి సిద్దప్ప, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉన్నారు.

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్

ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలందరికీ 78వ స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు!

రేడియాలజీ విభాగము - Dept of Radiology

SVS హాస్పిటల్‌లో అధునాతన, MRI 3.0 Tesla మరియు CT స్కాన్ 128 స్లైస్‌తో స్కాన్ చేయబడును. అనుభవజ్ఞులైన రేడియాలజిస్టులచే రిపోర్ట్ త్వరగా ఇవ్వబడును. ఈ క్రింద తెలుపబడిన రేట్ వర్తించును.

S.No.	Details	Rate
1	CT Brain Plain	2000
2	C T KUB	1500
3	CT PNS	1200
4	HRCT/CT Chest	2500
5	CT Abdomen	2500
6	CT Anjio	2500

S.No.	Details	Rate
1	MRI Brain	4000
2	MRI Any Scan	4000
3	MRI Whole Spine	5000

గమనిక: ఆరోగ్యశ్రీ వర్తించే శస్త్ర చికిత్సలు పరీక్షలతో పాటు మందులు ఉచితం.

ఆరోగ్యశ్రీ వర్తించని శస్త్ర చికిత్సలకు ఆపరేషన్‌లో రాయితీ ఇవ్వబడును.

వివరాలకు: ఈ 6303444232/7893888529 నంబరుపై సంప్రదించగలరు.

మదినిండా దేశభక్తి

78 ఏళ్లుగా తమ గుడిసె ఎదుట జెండా పండుగ



- దేశభక్తి చాటుకున్న స్వాతంత్ర్య సమరయోధుడు ఆర్య నర్సప్ప
- కడుపేదరికంలోనూ మువ్వన్నెల రెపరెపలు
- తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్న కుమారులు
- ప్రభుత్వ సహాయం నోచుకోని సమరయోధుడి కుటుంబం

మాతృభూమిపై అంతులేని మమకారం.. మదినిండా దేశభక్తి.. ఆంగ్లేయుల పాలనపై తిరుగుబాటు చేశాడు. భరత మాత ముద్దు బిడ్డగా.. నేను సైతం అంటూ.. ఉద్యమబాట పట్టి జైలుకు వెళ్లాడు. స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకున్నాడు. ఆయనే మక్తల్‌కు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆర్య నర్సప్ప. స్వాతంత్ర్యం సిద్ధించిన నాటి నుంచి పూరి గుడిసెలోనే ఉంటూ.. ప్రతి ఏటా క్రమం తప్పకుండా గుడిసె ఎదుట జెండా ఎగురవేస్తూ దేశభక్తిని చాటుతూ వచ్చాడు. తన పిల్లలకు ఆస్తిగా జాతీయ జెండాను ఇచ్చి.. కన్నుమూశాడు. పేదరికం వెంటాడుతున్నా ఆర్య నర్సప్ప వారసులు సైతం తండ్రి చూపిన బాటలో నడుస్తూ.. విధిగా జెండా పండుగ నిర్వహిస్తున్నారు.



మక్తల్‌లోని వినాయకనగర్‌లో గుడిసె ఎదుట జాతీయ జెండా ఆవిష్కరించిన స్వాతంత్ర్య సమరయోధుడు ఆర్య నర్సప్ప కుటుంబసభ్యులు (ఫైల్)

మక్తల్: పట్టణంలోని వినాయకనగర్‌కు చెందిన ఆర్య నర్సప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఏటా ఆగస్టు 15, జనవరి 26 వచ్చిందంటే చాలు ఆయన, వారి కుటుంబసభ్యులు నివసించే గుడిసె (ఇల్లు) మువ్వన్నెల పండుగ వేడుకలకు ముస్తాబవుతోంది. కుటుంబ సభ్యులంతా పొద్దున్నే లేచి ఇంటి ఎదుట కల్లాపి చల్లి.. స్నానాలు చేసి.. కొత్త దుస్తులు ధరించి.. జెండా ఎగురవేస్తారు. పిల్లలు జాతీయ గీతాలాపన చేస్తుంటే పెద్దలు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. తమ తాహతుకు తగినట్లుగా స్వీట్లు పంచి పెడతారు. ఏప్రిల్ 28, 2000 సంవత్సరంలో ఆర్య నర్సప్ప మృతిచెందాడు. ఆయన తన తదనాంతరం కుటుంబసభ్యులకు ఆస్తిగా జాతీయ పతాకాన్ని ఇచ్చి ఎట్టి పరిస్థితిల్లో జెండా పండుగను మరవొద్దని వారితో మాట తీసుకున్నాడు. ఆయన అడుగు జాడల్లోనే కుటుంబసభ్యులు నడుస్తున్నారు.

అందని ప్రభుత్వ సాయం

ఆర్య నర్సప్ప కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇప్పటికీ వరకు ఎలాంటి సహాయం అందలేదు. ఆయనకు ముగ్గురు కుమారులు, పెద్ద కుమారుడు నారాయణ తండ్రి వారసత్వంగా ఇచ్చిన పూరి గుడిసెలోనే ఉంటున్నారు. మిగిలిన ఇద్దరు కుమారులు సత్యనారాయణ, నర్సింహులు చిన్న అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వం మక్తల్ మండలం చిట్యాల గ్రామం వద్ద కొంత భూమి ఇచ్చినా.. ఈ భూమిపై వివాదం ఉండటంతో ఇంతవరకు వారి పేరిట పట్టా కాలేదు. ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని ప్రజాప్రతినిదులు, అధికారులు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆయన కుమారులు వాపోయారు.

రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం..

ఆర్య నర్సప్పది నిరుపేద కుటుంబం. స్వాతంత్ర్య పోరాటంలో జైలుకు వెళ్లాడు. జైల్లోనే చనిపోతాడుకున్న ఆయన బతికి వచ్చాడు. చిన్నపాటి గుడిసెలో నివసిస్తూ దినసరి కూలీ పని చేస్తూ కాలం వెళ్లదీశారు. ఖాళీ సమయం దొరికితే చాలు రజాకార్ల దుర్మార్గాలను కుమారులకు చెబుతుండేవాడు. ఆయన మరణానంతరం ఎలాంటి ఆస్తి పాస్తి రాకున్నా ఆయనకు ఇచ్చిన మాట ప్రకారం 78 ఏళ్లుగా స్వాతంత్ర్య వేడుకలను ఆర్య నర్సప్ప కుమారులు తమ గుడిసె ఎదుట ఘనంగా నిర్వహిస్తున్నారు. వీరు కూడా దినసరి కూలీలే. సాధారణంగా పండుగలైనా మరుస్తారేమో గానీ స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలను మరువరు. తాము జెండా పండుగ నిర్వహిస్తుండగా.. చుట్టు పక్కల వారు వింతగా చూస్తున్నా పట్టించుకోకుండా త్రివర్ణ పతాకం ఎగురవేసి గర్వ పడుతున్నారు.



ఆర్య నర్సప్ప, స్వాతంత్ర్య సమరయోదుడు (ఫైల్)

మేం ఉన్నంత వరకు నిర్వహిస్తాం..



స్వాతంత్ర్య పోరాటంలో మా నాన్న జైలులో వేశారు. ఎన్నో సార్లు బ్రిటిషర్లు, రజాకార్ల దుర్మార్గాలను మాకు చెప్పేవాడు. మా నాన్నకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది జెండా పండుగ నిర్వహిస్తాం. అన్ని పండుగల కంటే మాకు ఇదే ముఖ్యం. ఆర్థికంగా లేకున్నా.. ఎవరు సహాయం చేయకున్నా.. మా స్థాయిలో వేడుకలు నిర్వహిస్తాం. మేం ఉన్నంత వరకు, అలాగే మా పిల్లలు కూడా జెండా పండుగ నిర్వహించేలా సూచిస్తాం.

– నారాయణ, (ఆర్య నర్సప్ప పెద్ద కుమారుడు), వినాయక నగర్, మక్తల్

పుట్టిన ఊరిపై మమకారంతో..



మోడల్ స్కూల్‌గా మారిన గ్రామంలోని పాఠశాల భవనం



గ్రామంలో నిర్మించిన ఆలయం

మన్ననూర్: పుట్టిన ఊరు జన్మనిచ్చిన తల్లిలాంటిదనే మమకారంతో అమ్రాబాద్ మండలంలోని మాచారానికి చెందిన అండపల్లి జలంధర్‌రెడ్డి ఇప్పటికీ సుమారు రూ.5కోట్లకు పైగా తన సొంత డబ్బులు కేటాయించి గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. మొట్టమొదటి సారిగా గ్రామంలో అస్తవ్యస్తంగా ఉన్న పాఠశాల భవనానికి రూ.16 లక్షలు వ్యయం చేసి, పాఠశాల రూపురేఖలు మార్చి మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దాడు. మద్దిమడుగు ప్రధాన రహదారి నుంచి 1.5 కిలో మీటర్లు డబుల్ రోడ్డు, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు, తాగునీటి వనరులు కల్పించాడు. రూ.2.5 కోట్లతో సీతారామాంజనేయ స్వామి ఆలయంతో పాటూ గ్రామం ప్రధాన కూడలిలో ఆకర్శణీయమైన ఆర్చీ(ద్వారం) నిర్మాణం చేయించాడు. మార్చి నెలలో శంకర నేత్రాలయ ఐటీ మద్రాస్ ఆస్పత్రి వారిని మాచారానికి రప్పించి అచ్చంపేట నియోజకవర్గంలోని సుమారు 1,500 మందికి నాణ్యమైన కంటి పరీక్షలు చేయించడంతో పాటూ శస్త్రచికిత్సలు అవసరమైన 200 మందికి తన సొంత ఖర్చులతో అదే శంకర నేత్రాలయ ఐటీ మద్రాస్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి కంటి ఆపరేషన్లు చేయించాడు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుతో పాటూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే ఏర్పాటు చేస్తున్నాడు. నేను గతంలో వ్యవసాయం, కోళ్ల ఫారం వంటి చిన్న పనులు చేసి కష్టం విలువ తెలిసిన వాడిని. గోవా, మహారాష్ట్ర, మిజోరం, నాగాలాండ్, అస్సోం, మేఘాలయ వంటి రాష్ట్రాల్లో జాతీయ రహదారుల పనులు నిర్వహించి జాతీయ స్థాయి కాంట్రాక్టర్‌గా ఎదుగుతానని ఎన్నడూ ఊహించలేదు. రూ.కోట్లు సంపాదించినా.. అవేమి మన వెంటరావు. మనకు భగవంతుడు కల్పించిన దానిలో గ్రామానికి, గ్రామ ప్రజలకు సాయం చేయడంతోనే సంతృప్తి కలుగుతుందని నిర్ణయించుకుని గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టానని చెప్పారు.



జలంధర్‌రెడ్డి

కుట్టులేని జాతీయ జెండా

నారాయణపేటతో పాటు మండలంలోని కోటకొండ చేనేతకు పుట్టినిల్లు. కొందరు కార్మికులు తమ నైపుణ్యాలకు పదునుపెట్టి కొత్త కొత్త రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. అందులో యంగలి వెంకట్రాములు ఒకరు. కుట్టు లేని జాతీయ జెండాను మగ్గంపై నేసి నాటి ప్రధాని పీవీ నరసింహారావుకు హైదరాబాద్‌లో అందజేశారు. అలాగే కుట్టు లేని చొక్కా తయారుచేసి అప్పటి కేంద్ర చేనేతమంత్రిగా ఉన్న బండారు దత్తాత్రేయకు అందించారు. ఈయన కుమారుడు యంగలి రఘురాములు కూడా డిజైనర్‌గా జిల్లాస్థాయిలో గుర్తింపు పొందారు.

– నారాయణపేట



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్&డిస్టెన్స్ అడ్మిషన్స్ : డిగ్రీ, PG, B.Tech., Diploma, D&B- ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA,B.Sc(Agri), 10th, Inter, B.Sc (నర్సింగ్), GNM, 4 నెలల్లో పరీక్షలు. 8886977112, 339 [HA-2389]

WANTED

■ ఒమేగా హోటల్ హైదరాబాద్ వంట వృద్ధులకు, పేషెంట్సుకు, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంట పని చేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 20K. ఫోన్. 8977630002, 8977630003 [H-796268]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు – సాక్షి, మేనేజర్

వివాహేతర సంబంధానికి బాలుడు బలి

ఎర్రవల్లిచౌరస్తా: తనతో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందనే కోపంతో ఆమె కొడుకును గొంతు నులిమి అత్త మొగుడే హతమార్చాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన మౌలాలికి జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని మునగాలకు చెందిన మాలన్‌బీతో ఐదేళ్ల క్రితం రెండో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబసభ్యులతో కలిసి మునగాలలోనే ఉంటున్న మౌలాలి తన బావమరిది షేక్ జమీర్ భార్య షేక్ సమీరాతో కొంతకాలంగా వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. ఈ క్రమంలో మౌలాలి షేక్ సమీరాకు అవసరం ఉన్నప్పుడల్లా డబ్బు సాయం చేసేవాడు. ఇదే క్రమంలో బావమరిది షేక్ జమీర్ కూడా మౌలాలి వద్ద రెండేళ్ల క్రితం రూ.2 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆరు నెలల క్రితం ఈ డబ్బులు తిరిగి ఇచ్చే విషయమై గ్రామపెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అప్పటి నుంచి ఇరు కుటుంబాల మధ్య కాస్త దూరం పెరిగింది. కాగా.. షేక్ సమీరా మరో వ్యక్తితో చనువుగా ఉంటున్నట్లు అనుమానించి మౌలాలి ఆమెను నిలదీయడంతో.. తన ఇష్టమొచ్చినట్లు ఉంటానని తేల్చిచెప్పింది. దీంతో కక్ష్య పెంచుకున్న మౌలాలి సమీరా పెద్ద కుమారుడు షేక్ రఫీ(7)ని మంగళవారం సాయంత్రం తన బైక్‌పై తీసుకెళ్లి శివనంపల్లి శివారులోని కందిచేను పక్కన ఉన్న ముళ్లపొదల్లో గొంతు నులిమి హత్య చేశాడు. కొడుకు కనిపించకపోవడంతో షేక్ సమీరా అదే రోజు రాత్రి ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ చేపట్టగా అనుమానం వచ్చి మౌలాలిని విచారించగా హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. ఈ మేరకు సంఘటనా స్థలాన్ని డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



షేక్ రఫీ (ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ

మద్యానికి దూరం.. స్ఫూర్తి పథం

తొమ్మిదేళ్లుగా నిషేధం అమలు చేస్తున్న గోప్లాపూర్ గ్రామస్తులు

మద్యం తాగడంతో గ్రామంలో అల్లర్లు.. గొడవలు.. విచ్చలవిడితనం అధికంగా ఉండేది. పెద్దలు మద్యానికి బానిసలుగా మారుతుండగా వారిని చూసి యువత, పిల్లలు సైతం అదే బాటపట్టే ప్రమాదం ఉండడంతో ఈ చెడు సంస్కృతిని పారదోలేందుకు విద్యావంతులు నిర్ణయించుకున్నారు. యువత.. మహిళలు.. గ్రామస్తులందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చి మద్య నిషేధానికి నిర్ణయించారు. దాదాపు తొమ్మిదేళ్లుగా పక్కాగా అమలు చేస్తూ.. అటు గ్రామాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తూ.. ఆదర్శంగా నిలుస్తోంది వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం గోప్లాపూర్ గ్రామం.

- విద్యావంతులు.. యువత కలిసికట్టుగా నిర్ణయం
- సంపూర్ణ మద్యపాన నిషేధంతో ఆదర్శం



గోప్లాపూర్ గ్రామ ముఖ చిత్రం

పాన్‌గల్: వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం గోప్లాపూర్ గ్రామంలో 2016 జూలై 11 నుంచి మద్య నిషేధం అమలుచేస్తున్నారు. మద్యం విక్రయించినా, కొనుగోలు చేసినా రూ.10వేలు జరిమానా విధించాలని తీర్మాణం చేశారు. 4వేల జనాభా 2200 మంది ఓటర్లు ఉన్న గ్రామాన్ని సంపూర్ణ మద్య నిషేధ గ్రామంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు మద్యం వల్ల గ్రామంలో గొడవలతో పాటు డబ్బు ఖర్చుకావడం, అప్పులు పెరిగి కుటుంబ పోషణ భారంగా మారడం, కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతుండటంతో యువకులు, గ్రామస్తులు సమావేశమయ్యారు. మద్యం భూతాన్ని తరిమేసేందుకు నిర్ణయించు మద్య నిషేధంపై గ్రామసభను ఏర్పాటు చేశారు. గ్రామంలో మద్యం విక్రయించరాదని, కొనుగోలు చేసినా రూ.10వేలు జరిమానా విధించాలని తీర్మాణం చేశారు. గ్రామస్తులంతా పార్టీలకతీతంగా సమష్టి కృషితో యువకులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, గ్రామంలోని అన్ని కాలనీలలో మద్య నిషేధంపై ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆలయం ముందు ప్రతిజ్ఞ చేయించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామంలో మద్య నిషేధం కొనసాగుతోంది. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొన్నది. గ్రామాభివృద్ధికి ఆస్కారం ఏర్పడింది.

ప్రశాంతంగా ఉన్నాం..



గ్రామస్తులు, యువకుల సహకారంతో పార్టీలకతీతంగా సంపూర్ణ మద్య నిషేధానికి బాటలు వేయడంతో ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధిస్తోంది. ఎలాంటి గొడవలు లేకుండా గ్రామం ప్రశాంతంగా ఉంది. మా గ్రామం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

– పుల్లారావు, గోప్లాపూర్

భవిష్యత్ కోసం ముందడుగు



యువత, పిల్లల భవిష్యత్ కోసం గ్రామస్తులంతా ఏకమై మద్య నిషేధం అమలు చేశారు. ఒకప్పుడు మద్యం ప్రియులు ఇష్టారాజ్యంగా తాగడంతో గొడవలు, మహిళలపై దాడులు జరిగేవి. వీటన్నింటినీ కట్టడి చేయాలని.. గ్రామ అభివృద్ధి కోసం మద్య నిషేధం అమలు చేసి నేటికీ కొనసాగిస్తున్నారు. గ్రామంలో అందరూ ఆనందంగా ఉన్నారు.

– లక్ష్మి, మాజీ సర్పంచు, గోప్లాపూర్




















దుర్గావతి

విప్లవ వనిత

మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...

భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

**భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్...
వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు.
సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని
దేశం నుంచి తరిమికొట్టగలం అని
భావించిన దళంలో పిస్తోల్ పట్టిన
తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి.
బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన
భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు
అతడి భార్య అవతారం ఎత్తిందామె.
చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన
ఆ త్యాగమయి గురించి
స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...**

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్ఎస్ఆర్ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.



టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యాను‌పై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిల్చుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

- మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్‌లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

- పంజా సదయ్య, సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

- కొయ్యడ శ్రీనివాస్, ఆర్మీ జవాన్

మన(సు)లో మాట



మా బాబు ఒకచోట కుదురుగా ఉండటం లేదు...

మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చేస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

– కె. మాధవి, సికింద్రాబాద్


పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.



- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

హెల్దీ డైట్

సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

తయారీ: • ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి • గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
• కేలరీలు 63; • ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; • కార్బోహైడ్రేట్లు – 8-9 గ్రాములు; • ఫ్యాట్ – 2-3 గ్రాములు; • ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.

పోస్టల్ స్టాంపులు

యుద్ధం ముద్రలు

మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...

రుక్మిణీ లక్ష్మీపతి



ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.

సుభద్రా జోషి



గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.

రాణి మా గైడిన్లియు



బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణి మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.

బేగం హజ్రత్ మహల్



తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తల దాచుకొని పోరాడేది.

కమలానెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.

సుభద్రాకుమారి చౌహాన్



సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త, చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

అరుదైన ఆహ్వానం

12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.



సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటల్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి